కథ

# స్వేచ్ఛ

ఏ.వి.సి.రావు,

'రెల్లివలస...ఇంకెంత సమయం పడ్తుందండీ?..'' నాలో పెరుగుతోన్న అసహనాన్ని మాటల్లో తెలియనీ కుండా సామాన్యంగానే, బస్సులో నా పక్కనే కూర్చుని ఉన్న పెద్దాయన్ని అడిగాను.



"పది...పదిహేను నిమిషాలు..." చెప్పారాయన.

'అంటే...ఇంకా పదిహేను నిమిషాలు వేచివుండాలా!' అనుకున్నాను మనసులో. నాకు త్వరగా చెల్లి దగ్గరికి వెళ్ళి విషయం ఏమిటో! తెలుసుకోవాలనుంది. చేతి వాచీలో టైం చూశాను... పదిన్నర. నిన్న సాయంకాలం ట్రెయిన్ ఎక్కి, ఈరోజు ఉదయం తొమ్మిది గంటలకి శ్రీకాకుళం స్టేషన్‌లో దిగి, బస్సులో చెల్లి దగ్గరికి వెళ్తున్నాను. బండి ప్రయాణం అంతగా తెలియలేదు గాని బస్సు ప్రయాణం గంటన్నర కూడా చాలా ఎక్కువలా అనిపిస్తోంది. బస్సుకూడా చాలా స్లోగా నడుపుతున్నాడు డ్రైవరు. అయినా తప్పు అతడిది కాదు... రోడ్డు కూడా బాగోలేదు. ఎక్కడ చూసినా గోతులే... పట్నాలైతే రోడ్లు బాగుంటాయి కానీ పల్లెటూరు రోడ్లు మారేదెప్పుడో...!

రెల్లివలస వెళ్ళడం నాకిది మూడోసారి. మొదటిసారి చెల్లికి పెళ్ళైనప్పుడు.. అత్తవారింటికి దిగబెట్టడానికి, నేనూ నా శ్రీమతీ, అక్కా బావగారు, అమ్మా...తమ్ముడూ అందరం కలసి వెళ్ళాం. ఆసారి పెళ్ళి సందడిలో రెల్లివలస చేరడానికి ఎంత సమయం పట్టిందో పట్టించుకోలేదు. రెండోసారి నేనూ నా శ్రీమతీ, చెల్లి ప్రెగ్నెంటని తెలిసి మొదటి కాన్పు అమ్మగారింట్లో జరగాలనే నియమాలను పాటిస్తూ చెల్లికి ఏడవనెల ప్రవేశించగానే, తీసుకువెళ్ళడానికి వెళ్ళాం. ఆసారి కూడా ఎంత టైం పట్టిందో కనిపెట్టలేదు. కారణం శ్రీమతి నాతో ఉందంటే..సమయం ఎలాగడచిపోతుందో! నాకే తెలీదు. ఈసారి నేను ఒంటరిగా వెళ్తున్నాను. . అది కూడా చెల్లి దగ్గరికి త్వరగా చేరాలని ఆతృత!

నాన్నగారు పోయాక చెల్లి బాధ్యత ఇంటికి పెద్ద కొడుకుగా నాపైన పడింది. అమ్మ, చెల్లి పెళ్ళి చేయాలనే ఉద్దేశ్యంతో చుట్టాలూ...బంధువులందరికీ సంబంధాలు వెతకమని చెప్పేది. నా ప్రయత్నం మాత్రం చాలా తక్కువ.

కారణం ఏదెప్పుడు జరగాలో అప్పుడే జరుగుతుంది. మనం వెతికినంత మాత్రాన సంబంధాలు దొరికిపోవు కదా...దైవం కూడా తోడ్పడాలి.

ఆ దైవ నిర్ణయం ఒక మధ్యవర్తి ద్వారా కలిగింది. కుర్రవాడు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి మరణించాడు, ఒక చెల్లికి పెళ్ళి జరిగింది, ఇంకా ఒక చెల్లి ఉంది... ఆస్తి పాస్తులు అంతగాలేవని తెలిశాయి.. ఈ వివరాలు మా బంధువులకి తెలిగానే.. ఆస్తి పాస్తులు లేవు... ఒక చెల్లి కూడా ఉంది, పైగా పల్లెటూరు సంబంధమని అందరూ వెనకాడ్తున్నా నేను కుర్రవాడిని చూశాను. అందంకంటే మంచితనం, మర్యాదా నా మనసుని ఆకట్టుకుంది. ఇక మిగతా విషయాలు అనవసరంమనిపించింది. బి.ఎ. చేసిన చెల్లిని బోధ పర్చాను. తన అభిరుచులూ, నా అభిరుచులూ చాలా వరకూ ఒకటే కావడం చేత, చెల్లి ఒప్పుకుంది. వాళ్ళు అడిగినంత కట్నం ఇచ్చి పెళ్ళి జరిపించాను. నాకాళ్ళ మీద నేను నిలుచోవడం ఇప్పుడిప్పుడే కాబట్టి, నాన్నగారు సంపాదించిన డబ్బూ...అమ్మదాచిన బంగారం, చెల్లి పెళ్ళికి ఆధారమైంది.

పెళ్ళి జరిగిన సంవత్సరం తరువాత, చెల్లి మా ఇంట్లోనే ఉండగా, మొదటి కాన్పులో ఆమెకి పాప పుట్టింది. ఆ విషయం ఆమె భర్త 'రవి'కి తెలపగా తను ఒక్కడే వచ్చి చూసి వెళ్ళాడు. ఆ తరువాత పాపకి మూడో నెల ప్రవేశించగానే, రవి మళ్ళీ వచ్చి చెల్లినీ, పాపనీ తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆమె వెళ్ళిన నాలుగు నెలల తరువాత ఒక దూరపు బంధువు చెల్లి విషయంలో ప్రస్తావిస్తూ.. చెల్లిని వాళ్ళత్తయ్య, పుట్టిన పాప విషయంలో...కట్నం విషయంలో నానా మాటలు అంటోందని చెప్పడంతో...నాకు భరించలేని కోపం వచ్చింది.చెల్లి ఎప్పుడూ నాతో ఈ విషయం చెప్పలేదు. ఉత్తరాల్లో కూడా రాయలేదు. ఏదో ఆధారం లేనిదే ఎవరు ఊరికే చెప్పరు కదా! నిజం ఎంతో తెలుసుకోవాలని వెళ్తున్నాను.. అందుకేనాకు ఆతృతగా,అసహనంగా ఉంది...

రెల్లివలస దగ్గర పడుతున్నట్లుంది..ఇళ్ళు కనిపిస్తున్నాయి.. ఊరిలో అక్కడక్కడ కనిపిస్తోన్నాయి పెంకుటిళ్ళు... మిగతావన్నీ గడ్డిళ్ళే...మా చెల్లి గారిది కూడా గడ్డిల్లే... ఈ ఇళ్ళు చూస్తోంటే నాకు రైలు బండి జ్ఞాపకం వస్తుంది. పొడవుగా రైలు కంపార్టుమెంటుల్లా ఉంటాయి.. వెడల్పు మాత్రం ఒక మంచం వేస్తే చాలు నడవడానికి మరి స్థలం చాలదు.

ఊరులోకి రాగానే బస్సు ఆపాడు డ్రైవరు. సూట్‌కేస్ చేతిలో పట్టుకుని బస్సుదిగి నాలుగడుగుల్లో ఇంటికి చేరుకున్నాను.. ఇంటి గడపలో అడుగు పెడ్తుండగానే అత్తగారు దర్శనం ఇచ్చారు. గడప అరుగుమీద తీరిగ్గా కూర్చుని ఉందావిడ. గడపలోనే వ్రేలాడుతోన్న ఉయ్యాలలో పాప నిద్రిస్తోంది.

నన్నుచూడగానే "బాగున్నావా..బాబూ..?" అని పలకరించింది ఆవిడ .

"ఆ...ఆ..." అన్నాను. లోన ఎంత కపటమున్నా పైకి మాత్రం ఎంతో ప్రేమను ఒలకబోస్తారు.

"మీరు... బాగున్నారా...?" అన్నాను. సూట్‌కేస్ గడప అరుగుమీద పెడ్తూ...

"మా బాగోగులు ఎవరికి కావాలి బాబూ..." అంది అమాయకంగా. ఆవిడ మాటలు నన్నే సూచిస్తున్నాయని గ్రహించాను.

"నా చెల్లి ఈ ఇంటికి కోడలు కాబట్టి మీ బాగోగులు నాకు అవసరమే..." అన్నాను.

"నువ్వు మీ చెల్లికి రాసే ఉత్తరాలలో మా ప్రసక్తే ఉండదు" అంది. మా మాటలు విని చెల్లీ, రవీ..ఎవరూ కూడా వరండాలోకి రాలేదు. 'చెల్లి పెరట్లో ఉందేమో! రవి స్కూలుకి వెళ్ళుంటాడు. వాళ్ళ చెల్లి 'శారద' కూడా స్కూలుకే వెళ్ళుంటుంది' అనుకున్నాను. అత్తగారే తీరిగ్గా కూర్చుని నాకు కనీసం ఇంట్లోకి రమ్మనకుండా, గడపలోనే నిలబెట్టి, తన మనసులోని కపటం మాటల్లో కక్కుతోంది.

"నేను చెల్లికి రాసిన ఉత్తరాలు, కనీసం రెండు పేజీలు ఉంటాయి...ఇక అందులో మీ ప్రసక్తి.. అందరి ప్రసక్తి రాస్తూనే ఉంటాను.." అన్నాను కొద్దిగా చిరాకు పడ్తూ.

"నువ్వు రాసిన ఉత్తరాలు నా బుర్రకి ఎక్కవు బాబూ. ఏదో వర్ణించి రాస్తావు." పాపం...ఏమీ తెలీనట్లు ఎంతో అమాయకంగా అంది. నాకా మాటలు చిర్రెత్తించాయి.

"బాగుంది.. మీకు సాహిత్యం తెలీక పోవచ్చు గానీ సంసారం తెలీదా?" అన్నాను. నా గొంతుకు కరుగ్గా పలికింది.

"సంసారానికి అవసరమైనవి సాహిత్యంలో ఉండవు కదా బాబు..." 'అమ్మ బాబోయ్! ఈవిడ సామాన్యురాలు కాదు' అనుకున్నాడు మనసులో.

"మీరు స్పష్టంగా చెప్పండి..మీ ఉద్దేశ్యం అర్థం కావడం లేదు" అడిగాను. అంతలోనే చెల్లి అక్కడికి వచ్చింది. నన్నుచూడగానే" అన్నయ్యా... నువ్వా..! రాలోనికి..." అంది. అత్తయ్య కూడా"వెళ్ళుబాబులోపలికి వెళ్ళు" అంది. నేనులోపలికి వెళ్ళకుండా "మీరు నా ప్రశ్నకి జవాబు చెప్పలేదు.." అన్నాను సూటిగా.

"ఏం చెప్తాను బాబూ.. చెప్పకుండానే అర్థం చేసు కోవాలి పట్నంలో ఉన్నవాళ్ళు.." ఆ మాటలకి నాకు కోపం ముంచుకు వచ్చింది.

"పట్నంలో ఉన్న వాళ్ళకైనా మీ మూగ భాష అర్థం చేసుకోవడం కష్టమే!"

"అలా అని పట్నంలో ఉన్న వాళ్ళంతా మూర్ఖులా బాబూ...?" ఘటికురాలే!

"కాదు...పల్లెటూర్లో ఉన్న వాళ్ళందరూ దద్దమ్మలు కాదని అర్థం..." చెప్పాను. మా చెల్లాయికి తెలిసి పోయింది నేను ఊరుకోనని. అందుకే మౌనం వహించింది.

"వివరంగా చెప్పడానికి... మీ చెల్లాయి నూరిపొయ్యలేదా?" "ఆ పనికి తన సంస్కారం అడ్డు వచ్చిందేమో!" అన్నాను.

"ముండ... సంస్కారం.." మెల్లగా అంది కానీ వినిపించనట్లే.

"ఏం...మా సంస్కారంలో మీకు ఏమైనా లోపం




మేడిచర్ల సూర్యప్రకాశరావు , (బి.ఎ), కేరాఫ్.సత్యనారాయణ, రామరాజులంక -533 253, తూ॥గో॥ జిల్లా.

కనిపించిందా..?"

"పుట్టిన పిల్ల మెడలో చిన్న బంగారం గొలుసు వేయని వాళ్ళలో కూడా సంస్కారం వెదకమంటావా బాబూ..'

' ఓ అదా సంగతి..' ఇప్పుడు అర్థమైంది నాకు.

"మెడలో గొలుసు కనిపిస్తే 'సంస్కారం' ఉన్నవాళ్ళై పోతారా?"

"చాలు బాబు చాలు, నీ ఉపదేశాలతో సంసారాలు సాగవు..."

"అలా ఎవరంటున్నారు...?!"

"నేనంటున్నాను.. నేను నా కూతురుకి వాళ్ళ అత్తా - మామలు ఏదడిగితే అదే ఇచ్చాను..."

"నేనుకూడా... మీరు అడిగినంత కట్నం, బంగారం ఇచ్చాను. తక్కువ ఇవ్వలేదే!"

"సరె... ఇచ్చిన కట్నం ఏదో ఇచ్చావు కదా అని జీవితకాలం ఏమీ ఇవ్వనక్కర్లేదా!"

"ఆశకి అంతు ఉండదండీ..."

"అంటే...మేము ఆశ పరులమా...!"

"కాదు...దురాశాపరులు..."

"నువ్వు ఇలా కయ్యానికి కాళ్ళు దువ్వడం బాగులేదు బాబూ..'

'నేను కయ్యానికి కాళ్ళు దువ్వడంలేదు.. కయ్యానికి కాలుదువ్వుతోన్న వాళ్ళకి దారి చూపిస్తు న్నాను...అంతే..'

"నేను కూడా పెళ్ళి చేశాను.. నాకూతురికి... కానీ వాళ్ళత్త, మామా...అల్లుడూ ఇంతింత మాటలు అనలేదు బాబూ... వాళ్ళముందు నేను తలవంచుకునే తిరిగాను..'

"అన్యాయాన్ని సహిస్తూ ఆదర్శాలని చంపుకోవడం నా సిద్ధాంతం కాదండీ..."

"ఎవరు చేశారు అన్యాయం...? ఎవరికి చేశారు..!"

"చేయని వాళ్ళు తలవంచుకుని ఎందుకు తిరగాలి.."

"అలా అని ఆడపిల్ల వాళ్ళు మగ పిల్లాడు వాళ్ళని ఎదురు చెప్పొచ్చా...?"

"తప్పంటే తప్పని చెప్పడం తప్పుకాదే.."

"ఆ కోపం వాళ్ళు పిల్లమీద తీర్చుకుంటే..!"

"ఆ అవకాశం ఇచ్చేదెవరూ...?"

" ఒంటరిగా ఉన్నప్పుడు ఆ అవకాశమే చిక్కదా..?

" అంతవరకు పరిస్థితి దిగజారకముందే... బలిపశువుగా మారేకంటే బంధాల్ని తెంచుకుని స్వేచ్ఛగా బ్రతకడం మంచిది.."

"ఆ ఉపదేశాలు నువ్వు మీ చెల్లికే ఇవ్వు..."

"భయపెడ్తున్నారా...?"

"ఎలా అనుకున్నా పరవాలేదు..." మొండిగా అన్న ఆవిడ మాటలకి నేను కూడా ఒకనిర్ణయానికి వచ్చాను.

"నేను చెల్లాయిని తీసుకు వెళ్ళడానికే వచ్చాను..." అన్నాను దృఢంగా.

"ఎన్నాళ్ళు ఇంట్లో ఉంచుకోగలవు..?"

"బ్రతికున్నంత వరకు..."

"మొగుణ్ణి విడచి వెళ్తుందా..?"

"తప్పా...?"

"లోకం నవ్వుతుంది..."

"లోకంతో నాకేం పన్లేదు."

"సరే తీసుకు వెళ్ళు.." అంటూ విసురుగా లేచి.. ఇంట్లోకి వెళ్ళిపోయింది.

'నేను చెల్లాయి వైపు తిరిగి, చెల్లాయిని అజ్ఞాపించాను "వెళ్ళమ్మా... బట్టలు సర్దుకో... ఇప్పుడే వెళ్దాం..." అన్నాను. నా మాటలు విని చెల్లి అక్కడ నుంచి కదల్లేదు. ద్వారం దగ్గరే తలవంచుకునుంది.

"ఏవమ్మా... రావా? నేను తప్పుచేశానా...? నువ్వు కూడా నా ఆదర్శాలనే పాటించగలవని నమ్మకంతో అలా అన్నానమ్మా...నీకు బాధ కలిగితే చెప్పు... నీకోసం ఆవిడ కాళ్ళమీద పడి క్షమాపణలు చెప్పుకుంటాను."

"అది కాదన్నయ్యా..." అంటూ వంచిన తలెత్తిన చెల్లి కళ్ళలో కనిపించింది.

"ఛ... ఏడుస్తున్నావా...?! సరే నీకు బాధ కలిగినట్లయితే.. చెప్పు నువ్వు ఏది చేయమంటే అదే చేస్తాను...' అన్నాను బాధగా .


"ఎక్కడికి వెళ్తానన్నయ్యా... నా ఇల్లూ, నా సంసారం ఇదే! పెళ్ళికి ముందు మీతోడు... ఇప్పుడు నాభర్తే నాకు తోడన్నయ్యా.."

"ఎవరమ్మా చెప్పారు నీకు.. పెళ్ళైన ఆడదానికి భర్తే తోడని... పుస్తకాలలో చదివావా లేక అనుభవంతో చెప్తున్నావా... జీవితంలో ఎవరికి ఎవరమ్మా తోడు. నువ్వు చదివిన పుస్తకాలు అటుంచు... ఇక చదవగలిగితే మనుషుల్నిచదువు... నీ అనుభవమే నీకు ఆధారం.. నీ వ్యక్తిత్వమే నీకు తోడు.. మగవాడి తోడు లేనిదే బ్రతకలేననే ఆడదాని జీవితానికి అర్థంలేదమ్మా... నీ కాళ్ళపైన నువ్వే నిలుచోగలిగే వ్యక్తిత్వం నీలో ఉంచుకో... ఇంకొకరి ఆధారంతో నిలుచున్నావంటే.. అది ఆశ్రయమే అవుతుంది. ఆశ్రయంలో ఉన్నవ్యక్తి పట్ల ఎవరికైనా సానుభూతే ఉంటుంది తప్పించి, ప్రేమాభిమానాలుండవమ్మా.. ఈరోజుల్లో తలవంచుకుని తిరిగే కంటే తలెత్తుకుని తిరుగు... ఆదరించకపోయినా భయపడ్తారు."

"అది కాదన్నయ్యా... ఆయన మంచివారే.."

"నిజమే నమ్మా! రవి మంచివాడే.. అది నాకూ తెలుసు, కానీ నువ్వు ఇరవై నాలుగ్గంటలూ రవితోనే గడపలేవు కదా.. మీ అత్త నన్నే విడచి పెట్టలేదు. ఇక నిన్నెంతెంత మాటలంటుందో! నువ్వు వేరేగా చెప్పనక్కర్లేదు. అందుకే మీ అత్తయ్యకి బుద్ధి చెప్పాలి. ఇది నీకూ రవికీ మధ్య పరీక్ష లాంటిది.. రవీ నువ్వూ కలసి ఆనందంగా బ్రతకాలనే నేను కోరుకుంటున్నానమ్మా.. కానీ తల్లి తప్పు చేస్తోందని అతడు కూడా గ్రహించాలి. అలా అని తల్లిని ఇంటినుంచి గెంటేయమని కాదు. తల్లికి బోధపర్చాలి.. ప్రేమకి ఆధారం డబ్బుకాదనే గుర్తింపు తనలో తేవాలి.. అందరూ కలసి ఆనందంగా బ్రతకాలి. అదే నమ్మా నేను కోరుకునేది..."

"సరే... పదన్నయ్యా వెళ్దాం.. ఇప్పుడే... "అంటూ చెల్లి తనసూట్‌కేస్ తెరిచి. బట్టలు సర్దుకోవడం మొదలు పెట్టింది. బట్టలు సర్దుకోవడం పూర్తిచేసి... చీర మార్చుకునీ... పాపను కూడా ముస్తాబు చేసి. పది నిమిషాల్లోనే సిద్ధమైపోయింది. చెల్లి సూట్‌కేస్ నా సూట్‌కేస్ రెండూ, రెండు చేతుల్లో తీసుకున్నాను. చెల్లి పాపను పట్టుకొంది. ఇద్దరం కలసి గడప దాటుతుండగా, వెనుకనుంచి అత్తయ్య కంఠం వినిపించింది.




కెంచు చిన్నన్న, కార్టూనిస్టు, పోస్ట్ :చిన్నమెట్‌పల్లి, కోరుట్ల (మం.), కరీంనగర్ (జిల్లా) -505 453

## రాజశేఖర్‌ని జీవిత కమాండ్ చేస్తుందా?



డా॥ రాజశేఖర్, జీవితలు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' జంటని అందరికి తెలుసు. పోతే డా॥ రాజశేఖర్‌ని జీవిత కమాండ్ చేస్తుందన్న అపవాదు ఒకటుంది. ఈ విషయాన్నే ఆమె దృష్టికి తీసుకురాగా ఇలా చెప్పింది. "అందరూ నన్ను అలా అనుకోవడం పొరపాటు. నేనీ రోజు ఒక 'నెకెడ్ ట్రూత్'ని మీకు చెప్పాలి. నిజానికి నేను ఇంట్లో ఆయనని ఏ విషయంలోనూ డామినేట్ చేయను. ఏ పనయినా ఆయన్ని సంప్రదించకుండా చేయను. అసలీ అపవాదు ఎందుకొచ్చిందంటే డాక్టర్ రాజశేఖర్ అమ్మ నాన్నా తమ్ముళ్ళకు దూరంగా ఇక్కడ (హైదరాబాద్)లో ఉండటంతో ఆయనకు హోమ్‌సిక్ పోవడానికి ఆప్యాయత కావాలి. అది నేనివ్వడంతో ఈ నిందకు గురయ్యాను తప్పించి అయామ్ నథింగ్."

-రాజీ

"అగు బాబూ... అగు.."

వెనక్కి తిరిగి చూశాను. మా వెనుకనే అత్తయ్య నిల్చొనుంది.. ఆవిడ పక్కనే పెద్దకూతురు 'విజయ' కూడా నిల్చుంది. ఆమె వెనుక ఆమె పిల్లలిద్దరు కూడా ఉన్నారు. ఆమెను చూడగానే ఆశ్చర్యమనిపించింది. 'అరే... ఈమె ఎప్పుడు వచ్చింది! ఇప్పటి వరకూ కవిపించ లేదు.. పేరట్లోనే ఉందా!?' అనుకున్నాను మనసులో.

"నీ తల్లి కూడా ఇలాగే ఏవో నాలుగు మాటలు అంటే... ఇలాగే ఇల్లు విడచి వెళ్ళిపోతావా బాబూ..?!" అంటున్న అత్తయ్య మాటలు అంతకన్నా ఆశ్చర్యం కలిగించాయి. 'ఇదేమిటి ఈవిడ ఇప్పటికిప్పుడే మారి పోయింది..!' అనుకున్నాను కానీ ఆవిడ అలా అనేసరికి నాకోపం మంచులా కరిగిపోయింది. ఎందుకో! ఆ క్షణం నేనుకూడా తప్పు చేస్తున్నట్టు ఫీలయ్యాను.

"అవును బాబు నేను తప్పు చేశానని ఇప్పుడే తెలుసుకున్నాను... ఇదిగో విజయ ఇప్పుడే పెరట త్రోవన వచ్చింది. పిల్లలతో సైతం ఒంటరిగా విజయనగరం నుంచి... కారణం తెలుసా? బాబూ.."

తెలీదన్నట్టు చూశాను.

"ఇంత వరకూ వాళ్ళ అత్తా మామలు ఏదడిగితే అదే ఇచ్చాను. ఒకప్పుడు ఐదువేలు.. ఒకప్పుడు పదివేలు.. ఉన్న భూమి కూడా కొంత వరకు దీనికోసమే అమ్మేయాల్సొచ్చింది. ఎంతచేసినా ఇంకా వాళ్ళాశ చావలేదు... ఇప్పుడు మళ్ళీ డబ్బు కావాలట.. అల్లుడు ఉద్యోగం చేస్తూండగా ఇంకేదో వ్యాపారం పెడ్తాడట! 'ప్రతిసారి మా అమ్మా వాళ్ళు డబ్బు ఎక్కడ నుంచి తెస్తారు' అని మీకిష్టమైతే నన్ను ఆదరించండి... లేదంటే వెళ్ళిపోతానని.' నా కూతురు అనగా అయితే ఇప్పుడే వెళ్ళిపో' అని పంపించేశారు బాబూ...!" అంటూ బావురుమంది. అది విని నా గుండె కూడా బరువైంది. కళ్ళలో కూడా నీళ్ళు గిర్రున తిరిగాయి.

' ఈ ప్రపంచంలో ఎవరింట్లో ఆడ పిల్లలు లేరు... ఎవరికైనా ఆడపిల్లలు లేకున్నా ఉంటే బాగుణ్ణు అని తపిస్తుంటారు. ఆ ఆడపిల్లే ఒకరికి కూతురైతే.. ఇంకొకరికి కోడలని గుర్తించరేం! తన కూతురుకి అన్యాయం జరగ కూడదు కానీ కోడలకి అన్యాయం జరగవచ్చా!? తన కోడలే తనకూతురు అనే భావం పెంచుకుంటే.. ప్రతి ఇల్లుకూడా ఒక దేవాలయంగా మారుతుంది. ఆరోజు ఎప్పుడు వస్తుందో! మన మందరం తెలిసి...తెలిసే తప్పులు చేస్తాం... కానీ చిత్రం ఏమిటంటే తప్పు మనది కాదు. ఇంకొకరిదని బాధపడ్తాం.. ఇదే మనలో లోపం.'

"అవును వదినా నాకు జరిగిన అన్యాయం నీకు కూడా జరగకూడదు... లోపలికి పద..." అని చెల్లి చెయ్యి పట్టుకొంది విజయ.

చెల్లి ఇంకా నించునే ఉంది. "వెళ్ళమ్మ లోపలికి వెళ్ళు...' అన్నాను.

చెల్లాయి పాపను పట్టుకుని లోపలికి వెళ్ళిపోయింది.

"మీరు కూడా పదండి లోపలికి..." అంది విజయ.

" నువ్వు ఒక్క విషయం చెబితే లోపలికి వస్తాను..' అన్నాను.

"అడగండి...?"

"ఎంత డబ్బు కావాలంటున్నారు వాళ్ళు."

"పదివేలు.."

"ఆ డబ్బు నేను ఇస్తాను... నువ్వు నీ భర్త దగ్గరికి వెళ్ళిపో..." అన్నాను.

"అదేంటి... మీ చెల్లిని అన్యాయాన్ని ఎదిరించమని బోధించారు.. నాకు లొంగిపొమ్మంటున్నారు...?!" అంది ఆశ్చర్యంగా.


"ఆదర్శాలని కాపాడుకోవాలంటే ఆత్మబలం ముఖ్యం! అది నీలో ఉందా?"

"ఋజువు చేసి చూపిస్తాను..." అంది దృఢంగా.

"మీ అన్నయ్య మీద ఆధారపడ్తావా...?"

"కాదు... నాకాళ్ళ పైన నేనే నిల్చుని చూపిస్తాను.." అంటోన్న విజయ నాకు దుర్గాదేవిలా, కాళికాదేవిలా కనిపిస్తోంది! ఒకప్పుడు సీత... ఒకప్పుడు దుర్గా... ఒకప్పుడు కాళికా అన్నీ నేనే.. నేనే ఆది శక్తిని.. నాలో సహనముంది. శాంతం ఉంది.. అవసరమైతే శక్తిని నిరూపించగలిగే సామర్థ్యం కూడా ఉంది.. అది మీరే గుర్తించండి.. అన్నట్లు దివ్యంగా వెలిగిపోతోంది ఆమె ముఖం... ఇక ఆమెను ఆపడం ఎవరి తరమూ కాదనిపించింది..

ఏ.వి.సి.రావు,
రైల్వే క్వార్టర్ నం.ఏ/5/2
పోస్ట్ః జార్సుగూడ
జిల్లాః జార్సుగూడ(ఒరిస్సా)
పిన్‌కోడ్ -768201.




బి.సుధీర్, బి-39/15 ,ల్యాబ్ క్వార్టర్స్ , కాంచన్‌బాగ్ , హైదరాబాద్-500 258